సాక్షి అన్నమయ్య జిల్లా

గురువారం । 2 । ఫిబ్రవరి । 2023



బ్యాటింగ్ జోరు.. బౌలింగ్ హుషారు..

కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం క్రీడామైదానాలు వేదికగా సాక్షి ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్ ఉత్సాహంగా సాగుతోంది. -18లో..



నాటుసారా స్థావరాలపై ఉక్కుపాదం

జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాలతో ఎస్ఈబీ, పోలీసులు సారా స్థావరాలపై ఉక్కుపాదం మోపారు. -18లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.240
రెండోరకం	రూ.100	రూ.178



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 190 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	633	633
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 77.26 కిలోలు

న్యూస్‌రీల్

నవోదయ దరఖాస్తుల గడువు పెంపు

రాయచోటిటౌన్ : నవోదయలో చేరేందుకు ఈ నెల 8వ తేదీ వరకు గడువు పెంచినట్లు విద్యాశాఖ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జవహర్ నవోదయ విద్యాలయాలలో చేరేందుకు 5వ తరగతి చదివిన విద్యార్థులు అర్హులని తెలిపారు.

తొలిరోజే 89.6 శాతం పింఛన్ల పంపిణీ



రాయచోటి పరిధిలో వృద్ధుడికి పెన్షన్ డబ్బులను అందజేస్తున్న వలంటీర్

రాయచోటి: వేకువజాము నుంచే ప్రారంభమైన పింఛన్ల పంపిణీ కార్యక్రమం విజయవంతంగా నడుస్తోంది. బుధవారం మొదటి రోజునే వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు సంయుక్తంగా 89.6 శాతం మందికి పింఛన్ అందజేసి శభాష్ అనిపించుకున్నారు. ఒకవైపు చలి పెడుతున్నా లెక్కచేయకుండా వలంటీర్లు పెన్షన్లను ఇంటింటికి వెళ్లి అందించారు. జిల్లాలో 217845 మంది పెన్షన్‌దారులకు రూ. 60.9 కోట్లు మంజూరైంది. ఇందులో మొదటిరోజు రాత్రి 7.30 గంటల వరకు 194120 మందికి రూ. 53.52 కోట్లు పంపిణీ చేసినట్లు వెలుగు పీడీ సత్యనారాయణ తెలిపారు. మిగిలిన వారికి కూడా మరో రెండు రోజులలో పూర్తిగా పంపిణీ చేస్తామన్నారు.

- అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో సుమారు రూ. 4.15 కోట్లతో గునికుంట్ల రింగ్‌రోడ్డుకు ఫోర్ లేన్ రహదారి నిర్మాణం
- రాణా నుంచి హనుమాన్ జంక్షన్ వరకు రూ.16 కోట్లతో రోడ్డు నిర్మాణాలు
- జాతీయ రహదారిలో మహానుభావుల విగ్రహాలతో కొత్త రూపు



రాయచోటిలోని ఆర్అండ్‌బీ అతిథిగృహం

రాయచోటిలోని రింగ్‌రోడ్డు వరకు పూర్తయిన గునికుంట్ల డబుల్ లేన్ రహదారి



అభివృద్ధి వైపు వడివడిగా అడుగులు

సాక్షి రాయచోటి: అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి అభివృద్ధి బాటలో పయనిస్తోంది. కరువుతో అల్లాడిన ప్రాంతం ఇప్పుడిప్పుడే ప్రగతివైపు పరుగులు పెడుతోంది. అన్నమయ్య జిల్లాగా ఆవిర్భవించిన తర్వాత రాయచోటి రూపురేఖలు మారుతున్నాయి. ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంలో భాగంగా అన్ని రంగాల్లో రాయచోటిని తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించి అందుకు అనుగుణంగా అధికారులు ముందుకు సాగుతున్నారు. దీంతో ఒక్కొక్కటిగా సౌకర్యాలు ఒనగూరుతున్నాయి. మౌలిక సదుపాయాల కల్పన మొదలుకొని ప్రజల ఆహ్లాదం, ఆటలు ఇలా అన్ని రంగాల్లో పురోగతిబాట పట్టిస్తున్నారు.

రాయచోటిలో ఆర్అండ్‌బీ అతిథి గృహం

రాయచోటిలో చాలా రోజులుగా అతిథి గృహం లేక ఉన్నతాధికారులు మొదలుకొని వీఐపీలకు ఇబ్బందులు తప్పేవి కావు. జిల్లా పర్యటన నిమిత్తం వచ్చినా.. ఇతర కారణాలతో అధికారులు రాయచోటిలో ఆగినా ప్రభుత్వ అతిథి గృహం లేకపోవడంతో రాత్రి పూట బస చేసేందుకు అటు హార్సిలీహిల్స్ వైపుగానీ, ఇటు కడపకు గానీ వెళ్లేవారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త గడికోట శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్‌ల చొరవతో రాయచోటికి ఆర్అండ్‌బీ అతిథి గృహాన్ని తీసుకు రావడంతోపాటు వేగవంతంగా పూర్తిచేసేలా చర్యలు చేపట్టారు. కడప–చిత్తూరు జాతీయ రహదారి పక్కన రాయచోటిలోని కలెక్టరేట్‌కు సమీపంలో సుమారు రూ. 1.40 కోట్లతో అద్భుతంగా ఆర్అండ్‌బీ అతిథి గృహాన్ని నిర్మించారు. జనవరి 25వ తేదీన ప్రభుత్వ విప్ గడికోట శ్రీకాంత్‌రెడ్డి, కలెక్టర్ గిరీషా పీఎస్, జేసీ తమీమ్ అన్సారియా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డిలు ప్రారంభించి అందుబాటులోకి తీసుకు వచ్చారు.

రాయచోటికి రోడ్లతో మహర్దశ

రాయచోటిలో రోడ్లకు మహర్దశ పట్టింది. రాయచోటిలోని సుండుపల్లె రోడ్డుకు సంబంధించి మెయిన్ రోడ్డు (రాణా) నుంచి హనుమాన్ జంక్షన్ వరకు ఫోర్ లేన్ రహదారి మంజూరైంది. సుమారు రూ. 16 కోట్లతో రోడ్డును అద్భుతంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించారు. జనవరి 26వ తేదీన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డితోపాటు ప్రభుత్వ విప్ గడికోట శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తదితరులు శంకుస్థాపన చేశారు. అలాగే రాణా నుంచి హనుమాన్ జంక్షన్ వరకు ఫోర్‌లేన్ రోడ్డుకు అనుబంధంగా హనుమాన్ ఆలయ సమీపంలోని వంకపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం కూడా చేపట్టనున్నారు.

- రాయచోటి పట్టణంలోని గునికుంట్ల రోడ్డుకు సంబంధించి పట్టణం నుంచి రింగ్‌రోడ్డు వరకు రోడ్డును అద్భుతంగా నిర్మించారు. సుమారు రూ. 4.15 కోట్లతో నిర్మించిన ఈ రహదారిని రెండు లేన్లతో ఏర్పాటు చేయడంతోపాటు అటు, ఇటు కొంతమేర ఫుట్‌పాత్‌లు, డ్రైనేజీ నీటికి సంబంధించి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ రోడ్డును కూడా ఇటీవలే ఎంపీ, ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్‌లు ప్రారంభించారు.

ప్రత్యేక ఆకర్షణగా మహానుభావుల విగ్రహాలు

రాయచోటిలోని జాతీయ రహదారి ప్రాంతంలో మహనీయుల విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ప్రభుత్వ విప్ గడికోట శ్రీకాంత్‌రెడ్డి, కలెక్టర్ గిరీషా పీఎస్‌లు ప్రత్యేక చొరవ తీసుకుని మహనీయులను నిత్యం స్మరించుకునేలా విగ్రహాలు ఏర్పాటు చేశారు. కలెక్టరేట్ సమీపంలోనే జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతోపాటు అక్కడే 102 అడుగుల స్థూపంపై అతి పెద్ద జాతీయ జెండా ఎగిరేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఇది రాయచోటికే తలమానికంగా నిలుస్తూ పలువురి ప్రశంసలు అందుకుంటోంది. రోడ్డులోని పలు సర్కిళ్లలో మహాత్ములైన జ్యోతిరావు పూలే, బీఆర్ అంబేడ్కర్, ఏపీజే అబ్దుల్ కలాం తదితరుల విగ్రహాలను ఇటీవలే ఆవిష్కరించారు.

రాయచోటిని అందంగా తీర్చిదిద్దుతాం



రాయచోటిని అన్ని రంగాలలో తీర్చిదిద్దుతాం. ఆటలు మొదలుకొని ఆహ్లాదం వరకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం. ఇప్పుడిప్పుడే రాయచోటి అభివృద్ధి వైపు పయనిస్తోంది. రాయచోటి పట్టణాన్ని సుందరంగా తయారు చేసేందుకు ముందుకు వెళుతున్నాం. రానున్న కాలంలో జిల్లా కేంద్రం అన్ని వసతులకు నెలవు కానుంది. – గిరీషా పీఎస్, కలెక్టర్, అన్నమయ్య జిల్లా

అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుతా



రాయచోటి నియోజకవర్గాన్ని అభివృద్ధిపరంగా ఆదర్శంగా నిలిపేందుకు ప్రయత్నిస్తా. ఇప్పటికే అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు అడుగులు పడుతున్నాయి. గతంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాయచోటికి వచ్చిన సందర్భంగా అనేక వరాలను ప్రకటించారు. అందుకు అనుగుణంగా అన్ని అభివృద్ధి పనులు చేసుకుంటూ వచ్చాం. మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయడం చరిత్రలో సువర్ణాధ్యాయం. ఇలా ఒక్కొక్కటిగా జిల్లా కేంద్రమైన రాయచోటి పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందుతోంది. – గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్, రాయచోటి

కడప విమానాశ్రయం రన్‌వే వెడల్పుకు కేంద్రం సమ్మతి

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి లేఖ ద్వారా తెలిపిన కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య ఎం.సింధియా



కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల: కడప విమానాశ్రయంలో విమానాల నైట్ ల్యాండింగ్ కోసం, రన్‌వే వెడల్పు, ఆర్ఈఎస్ఏ, పీఏపీఏ తదితర వాటి పనులకు సంబంధించి సమ్మతిస్తూ భారత పౌర విమానయాన,ఉక్కు మంత్రిత్వ శాఖ మంత్రి జ్యోతిరాదిత్య ఎం.సింధియా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి లేఖ ద్వారా తెలియజేశారు. కడప విమానాశ్రయంలో విమానాల నైట్ ల్యాండింగ్ కోసం అనుమతి కోరుతూ గత ఏడాది డిసెంబర్ 8వ తేదీన కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి భారత పౌర విమానయాన,ఉక్కు మంత్రిత్వ శాఖ మంత్రికి లేఖ రాశారు. దీనికి స్పందించి డీజీసీఏ బృందం గత ఏడాది డిసెంబర్ 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు తనిఖీ చేసింది. యాక్షెన్ టేకెన్ రిపోర్ట్ (ఏటీఆర్) డాక్యుమెంట్లను పరిశీలించిన డీజీసీఏ కడప విమానాశ్రయం రన్‌వే వెడల్పు, ఆర్ఈఎస్ఏ, పీఏపీఏ తదితర వాటికి సంబంధించి సమ్మతిని కడప విమానాశ్రయానికి తెలియజేసిందన్నారు. ప్రయాణికుల నిర్వహణకు అనువైన కొత్త టెర్మినల్ భవనం మంజూరుకు సంబంధించి కడప విమానాశ్రయంలో కొత్త డొమెస్టిక్ డిపార్చర్ టెర్మినల్ బిల్డింగ్ నిర్మాణం, అందుకు అనుబంధంగా చేపట్టే పనుల విషయంలో చొరవ చూపడం అభినందనీయమన్నారు. అందుకు సంబంధించి భూమి, లభ్యత, కమర్షియల్ అనుకూలత, సామాజిక, ఆర్థిక పరమైన అంశాలను పరిగణనలోకి తీసుకుని ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా వారి ద్వారా సంబంధిత పనులను నిర్వహించుకోవచ్చని లేఖ ద్వారా కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య ఎం.సింధియా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి వివరించారు.

ఘనంగా భీష్మ ఏకాదశి ఉత్సవం



ప్రత్యేక అలంకరణలో సీతారామలక్ష్మణ మూర్తులు

ఒంటిమిట్ట: ఏకశిలానగరి ఒంటిమిట్టలోని శ్రీ కోదండపాణి కోవెలలో బుధవారం భీష్మ ఏకాదశి వేడుకను టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్రీ సీతారామలక్ష్మణ సమేత మూలవరులకు పంచామృతాలతో అభిషేకం జరిపారు.ప్రత్యేకంగా అలంకరించి మంగళవాయిద్యాల నడుమ ఒంటిమిట్ట పురవీధుల్లో ఊరేగించారు. గ్రామోత్సవంలో స్వామి వారికి భక్తులు కాయాకర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు.

కడపలో యువకుడి దారుణ హత్య



రేవంత్ మృతదేహం

కడప అర్బన్: కడప వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రైల్వేస్టేషన్ రోడ్డులో రఘు బార్ అండ్ రెస్టారెంట్ ఆవరణలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పేటా రేవంత్ (27) అనే యువకుడిని కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేశారు. ఈ సంఘటనలో రేవంత్ స్నేహితుడు అభిలాష్(25) తీవ్రంగా గాయపడ్డాడు. ఈసంఘటనపై పోలీసులు, బంధువులు తెలిపిన ప్రాథమిక సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కడప నగరం రాజారెడ్డి వీధికి చెందిన పేటా నాగరాజు రెండో కుమారుడు పేటా రేవంత్ (27) జోన్‌లో ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. అక్కడి నుంచి గత రాత్రి కడపకు వచ్చాడు. బుధవారం రాత్రి తన స్నేహితుడు, సీయోన్‌పురానికి చెందిన అభిలాష్‌తో కలిసి సంఘటన స్థలానికి వెళ్లారు. అక్కడికి రేవంత్‌తో మనస్పర్థలు కలిగిన గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ఘర్షణ పడ్డారు. రేవంత్, అభిలాష్‌పై కత్తులతో దాడి చేశారు. రేవంత్ అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. తీవ్రంగా గాయపడిన అభిలాష్‌ను సీఐ ఎన్.వి నాగరాజు, తమ సిబ్బందితో కలిసి తమ వాహనంలోనే రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం అభిలాష్ రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. సమాచారం అందుకున్న వెంటనే కడప డీఎస్పీ బి. వెంకట శివారెడ్డి, వన్‌టౌన్ సీఐ ఎన్.వి నాగరాజు, కమాండ్ కంట్రోల్ సీఐ వెంకటేశ్వర్లు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రేవంత్ మృతదేహం వద్ద తల్లిదండ్రులు, బంధువులు విలపించారు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించారు. హంతకులకోసం పోలీసులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు సీఐ నాగరాజు కేసు నమోదు చేశారు.

క్రమశిక్షణతోనే పోలీసు శాఖకు మంచిపేరు

ఏఆర్ "మొబలైజేషన్" కార్యక్రమంలో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



ఏఆర్ కానిస్టేబుల్‌కు ప్రోత్సాహక బహుమతిని అందిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

రాయచోటి: క్రమశిక్షణతో విధులు నిర్వహించి జిల్లా పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా సాయుధ పోలీసు బలగాలకు నిర్వహించిన "మొబలైజేషన్" కార్యక్రమం ముగింపు కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమర్థవంతంగా విధులు నిర్వర్తించేందుకు వీలవుతుందన్నారు. అందులో భాగంగానే యోగా, ధ్యానం గురించి ప్రత్యేక తరగతులు నిర్వహించామన్నారు. ఫైరింగ్, డ్రిల్, కవాతు, మాబ్ కంట్రోల్, ప్రముఖుల బందోబస్తు, తదితర విధులు మరింత సమర్థవంతంగా ఎలా నిర్వహించవచ్చో దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ విబి రాజ్‌కమల్, ఏఆర్ డీఎస్పీ మహబూబ్‌బాషా, ఆర్ఐలు మహబూబ్‌వలి, జావేద్, పెద్దయ్య, ఆర్ఎస్ఐలు, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

చోరీల అడ్డుకట్టకు గస్తీ ముమ్మరం చేయాలి

రాజంపేట: దొంగతనాలకు అరికట్టేందుకు గస్తీని ముమ్మరం చేయాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశించారు. బుధవారం రాజంపేట రూరల్ పోలీసుస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుస్టేషన్ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టేందుకు సమాచార వ్యవస్థను పటిష్టపరుచుకోవాలన్నారు. ముందస్తు సమాచారాని సేకరించుకొని ఎర్రచందనం అక్రమరవాణాను అరికట్టాలన్నారు. అనంతరం రికార్డులను, వివిధ కేసులకు సంబంధించిన ఫైళ్లను పరిశీలించారు. సిబ్బందికి సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకోవాలన్నారు.

రూ.కోట్లు విలువచేసే స్థలాల పరిశీలన

పట్టణ నడిబొడ్డున ఉన్న రూరల్ పోలీసుస్టేషన్ వెనుక వైపు ఉన్న పోలీసుశాఖకు సంబంధించిన ఖాళీ స్థలాలను జిల్లా ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపయోగంగా ఉన్న స్థలాలను ఏ విధంగా ఉపయోగంలోకి తీసుకురావాలన్న దానిపై ప్రణాళికలు రూపొందించనున్నట్లు వివరించారు. ఎస్పీ వెంట డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి, సీఐలు నరసింహారావు, పుల్లయ్య ఉన్నారు.

కొంచెం ఇష్టం.. కొంచెం కష్టం



పార్లమెంటులో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. కొన్ని వర్గాలకు మేలు చేకూర్చేలా కొన్ని అంశాలు ఉండగా.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మరీ ముఖ్యంగా రాయలసీమకు తీరని అన్యాయం చేసే విధంగా బడ్జెట్ ఉందనే అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. వేతన జీవులకు కాస్త ఊరట లభించినా.. మిగిలిన అన్ని వర్గాల్లోనూ తీవ్ర అసంతృప్తి కనిపిస్తోంది. కేంద్ర బడ్జెట్‌పై వివిధ వర్గాల వారి అభిప్రాయాలు.. – రాయచోటి అర్బన్

ఏపీకి మరోమారు కేంద్రం మొండిచేయి



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి మరోమారు మొండిచేయి చూపారని సీపీఐ అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు పేర్కొన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా అంశంగాని, విభజన చట్టం హామీల అమలు గురించి ప్రస్తావించలేదన్నారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల అభివృద్ధికి నిధుల కేటాయింపు జరగలేదన్నారు. పోలవరం, అమరావతి రాజధాని నిర్మాణాలకు నిధుల ఊసేలేదన్నారు. కేవలం ఉన్నత వర్గాలను సంతృప్తి పరిచే విధంగా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయన్నారు. 2023లో ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలను దృష్టిలో ఉంచుకుని బడ్జెట్‌లో అంకెల గారడీ చేశారన్నారు.

వేతన జీవులకు ఊరట



వేతన జీవులకు కేంద్ర బడ్జెట్‌లో ఊరట నిచ్చారు. ప్రస్తుతం ఉన్న రూ.5 లక్షల ఆదాయపు పన్ను రాయితీ పరిమితిని రూ. 7 లక్షల వరకు పెంచడం సంతోషం. అదే విధంగా వ్యవసాయ, ఉపాధి రంగాలతో పాటు రైల్వేకి పెద్ద పీట వేశారు. గృహ కొనుగోలుదారులకు, కొత్తగా ఇళ్ల నిర్మించుకునే వారికి గుడ్ న్యూస్ చెప్పారు. పీఎం ఆవాస్ యోజన పథకానికి గత ఏడాది రూ. 48 వేల కోట్లు కేటాయించగా ఈసారి రూ.79 వేల కోట్లు కేటాయించారు. చిరుధాన్యాల పంటలకు ప్రోత్సాహకాలు ప్రకటిస్తామని చెప్పడం సంతోషం. –ఎన్‌వి. రమణారెడ్డి, కరస్పాండెంట్, గోల్డన్‌వ్యాలీ విద్యా సంస్థలు, కురబలకోట

ఇది కార్మిక, ప్రజావ్యతిరేక బడ్జెట్



కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మికులు,రైతులు ,శ్రమజీవులకు పూర్తిగా వ్యతిరేకంగా ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి పి. శ్రీనివాసులు పేర్కొన్నారు. కేంద్ర పథకాలైన ఐసీడీఎస్, మధ్యాహ్న భోజనం, జాతీయ ఆరోగ్య మిషన్, జాతీయ విద్యామిషన్, జాతీయ జీవనోపాధుల మిషన్‌లకు కేటాయింపులు పెంచకపోవడం దారుణమన్నారు. మహాత్మ గాంధీ గ్రామీణ ఉపాధి పథకానికి తీవ్ర స్థాయిలో కోతపెట్టడం తగదన్నారు.

విద్యారంగానికి కేటాయింపు శూన్యం



బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయించిన నిధులు శూన్యమని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సర్వేపల్లె నరసింహ విమర్శించారు. కేంద్రబడ్జెట్‌లో10 శాతం, రాష్ట్ర బడ్జెట్‌లో 30శాతం, జీడీపీలో 6 శాతం నిధులు కేటాయించాలని కొఠారి కమిషన్ చేసిన సూచనలను విస్మరించడం దారుణమన్నారు. రాష్ట్రానికి కేటాయించిన 11 జాతీయ యునివర్సిటీలకు నిధుల కేటాయింపులో జరిగిన అన్యాయం పైన, ఖాళీగా ఉన్న ప్రొఫెసర్, నాన్‌టీచింగ్ పోస్టుల భర్తీపైన, రీసెర్చ్ స్కాలర్‌లకు అధిక నిధుల కేటాయింపు తదితరాలపై ఎంపీలు పార్లమెంటులో నిలదీయాలన్నారు.

కరువు నేలకు మంచి రోజులు

- త్వరలో హంద్రీనీవా ప్రాజెక్టు పుంగనూరు ఉపకాలువ పనులు ప్రారంభం
- టెండర్ దక్కించుకొన్న నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ కంపెనీతో రూ.1,217 కోట్ల పనుల ఒప్పందంపై సంతకాలు
- 380 నుంచి 1,180 క్యూసెక్కులకు పెరగనున్న కాలువ సామర్థ్యం



కాంట్రాక్టు సంస్థ ప్రతినిధితో ఒప్పందం చేసుకొన్న సీఈ శ్రీనివాసులురెడ్డి, అధికారులు

బి.కొత్తకోట: అన్నమయ్య, చిత్తూరు జిల్లాలోని కరువు ప్రాంతాలకు మంచిరోజులు రాబోతున్నాయి. శ్రీసత్యసాయి పుట్టపర్తిజిల్లా నుంచి అన్నమయ్య జిల్లాలోకి ప్రవేశించి చిత్తూరు జిల్లాలోకి సాగే అనంతవెంకటరెడ్డి హంద్రీనీవా సాగునీటి ప్రాజెక్టు రెండోదశలోని పుంగనూరు ఉపకాలువ విస్తరణ పనులకు బుధవారం కాంట్రాక్టు సంస్థ, ప్రభుత్వం ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశాయి. తిరుపతి తెలుగుగంగ చీఫ్ ఇంజినీర్ కార్యాలయంలో ఈ మేరకు కాంట్రాక్టు సంస్థ ప్రతినిధి కృష్ణప్రసాద్, ప్రభుత్వం తరపున చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసులు రెడ్డిలు ఒప్పందంపై సంతకాలు చేశారు. మదనపల్లె ఎస్ఈ సీఆర్.రాజగోపాల్, ఈఈ రమేష్‌బాబు, డీఈ శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు. పనులకు సంబంధించి అధికారిక అనుమతులన్నీ పూర్తవడంతో ఇక క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభం కానున్నాయి. గత ఏడాది పుంగనూరు ఉపకాలువ విస్తరణ పనుల కోసం ప్రభుత్వం టెండర్లు నిర్వహించగా హైదరాబాద్‌కు చెందిన నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ లిమిటెడ్ రివర్స్ టెండరింగ్‌లో లెస్‌కు టెండర్ దాఖలు చేయడంతో ఎల్–1గా నిలిచింది. అన్నమయ్య జిల్లా పెద్దతిప్పసముద్రం మండలం సీవీరామన్నగారిపల్లె నుంచి హంద్రీనీవా పుంగనూరు ఉపకాలువపై కిలోమీటర్ 79.600 నుంచి చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం పెద్దపంజాణి మండలంలో కిలోమీటర్ 220.350 వరకు కాలువను విస్తరించే పనులకు ప్రభుత్వం రూ.1,219,93,02,150 అంచనాతో టెండర్లను ఆహ్వానించింది. ఈ పనులు దక్కించుకునేందుకు నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ లిమిటెడ్, మేఘా ఇంజినీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ టెండర్లను దాఖలు చేశాయి. రివర్స్ టెండరింగ్‌లో నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ ప్రభుత్వ అంచనా విలువకంటే 0.1997 శాతం తక్కువకు రూ.1,217,49,40,146.53తో టెండర్ దాఖలు చేయడంతో ఎల్–1గా నిలిచి టెండర్ దక్కించుకుంది. దీనివల్ల ప్రభుత్వానికి రూ.44,15,78,137 ఆదా అయింది.

1,180 క్యూసెక్కులు ప్రవహించేలా..

అన్నమయ్య జిల్లా పెద్దతిప్పసముద్రం మండలం సీవీ రామన్నగారిపల్లె వద్ద కిలోమీటర్ 79 నుంచి చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం గంగవరం మండలం తిమ్మిరెడ్డిపల్లె వద్ద 220.350 కిలోమీటర్ వరకు పుంగనూరు ఉపకాలువ సాగుతుంది. కాలువ పొడవు 140.75 కిలోమీటర్లుండగా అదనంగా 4.8 మీటర్ల మేర కాలువ విస్తరణ పనులు చేపడతారు. కాలువలపై నిర్మించిన ఆరు ఎత్తిపోతల పథకాలను విస్తరిస్తారు. ప్రస్తుతం కాలువలో నీటి ప్రవాహ సామర్థ్యం 380 క్యూసెక్కులు విస్తరణ పనులు పూర్తయితే ప్రవాహ సామర్థ్యం 1,180 క్యూసెక్కులకు పెరుగుతుంది.

రెండుజిల్లాలకు 1,550 క్యూసెక్కులు

పుంగనూరు ఉపకాలువ విస్తరణ పనులు పూర్తయ్యాక వైఎస్సార్ జిల్లా గండికోట రిజర్వాయర్ నుంచి సీవీరామన్నగారిపల్లె వద్ద ఈ కాలువలోకి కృష్ణా జలాలు తరలించి అన్నమయ్య, చిత్తూరు జిల్లాలకు అందిస్తారు. ఈ జిల్లాలకు 1,550 క్యూసెక్కుల నీటిని కేటాయించగా నిర్మాణంలోని తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ముదివేడు రిజర్వాయర్, చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గంలోని ఆవులపల్లె, నేతికుంటపల్లె రిజర్వాయర్లకు నీటిని తరలిస్తారు. కృష్ణా జలాలతో రెండు జిల్లాల్లోని కరువు ప్రాంతాలకు పుష్కలంగా నీళ్లు అందుతాయి. సాగు, తాగునీటికి ఇబ్బందులు శాశ్వతంగా తొలగిపోతాయి.

బ్యాటింగ్ జోరు.. బౌలింగ్ హుషారు..

ఉత్సాహంగా సాగుతున్న ఎస్‌పీఎల్

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం క్రీడామైదానాలు వేదికగా నిర్వహిస్తున్న సాక్షి ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్ ఉత్సాహంగా సాగుతోంది. వివిధ కళాశాలల క్రీడాకారులు తమ బ్యాటింగ్ నైపుణ్యాలను ప్రదర్శిస్తూ చూడ చక్కటి షాట్‌లతో అలరిస్తుండగా.. ప్రత్యర్థి జట్లను తక్కువ స్కోరుకే అవుట్‌చేయడంతో పాటు పరుగులు తీయకుండా ఉండేలా బౌలర్లు శ్రమిస్తున్నారు. బుధవారం నిర్వహించిన మ్యాచ్‌లు ఆద్యంతం ఆసక్తికరంగా సాగాయి.


మ్యాచ్‌లో తలపడుతున్న జట్లు

SPL SAKSHI PREMIER LEAGUE
SAKSHI
సాక్షి | సాక్షి TV
SAKSHI DIGITAL
MEDIA GROUP

నేటి మ్యాచ్‌ల వివరాలు..

కేఎస్ఆర్ఎం మైదానంలో..

- **ఉదయం 9 గంటలకు :** బద్వేలు శ్రీరాచపూడి నాగభూషణం డిగ్రీ కళాశాల–ఓబులవారిపల్లె శ్రీపాలకొండ్రాయ డిగ్రీ కళాశాల
- **ఉదయం 11 గంటలకు :** ఎస్.కె.ఎస్.సి. డిగ్రీ కళాశాల, ప్రొద్దుటూరు–నిర్మల ఫార్మసి కళాశాల, కడప.

కేఓఆర్ఎం మైదానంలో..

- **ఉదయం 9 గంటలకు :** గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాల,కడప –ఎస్.వి. డిగ్రీ కళాశాల, కడప.
- **ఉదయం 11 గంటలకు :** కె.ఎస్.ఆర్.ఎం. కడప – శ్రీహరి డిగ్రీ కళాశాల–2 జట్టు, కడప.

ఎస్.వి. డిగ్రీ కళాశాల..


కడప ఎస్.వి. డిగ్రీ కళాశాల జట్టు

కేఓఆర్ఎంలో జరిగిన మ్యాచ్–2లో కడప ఎస్.వి. డిగ్రీ కళాశాల జట్టు, ప్రొద్దుటూరు ఎస్.ఆర్.ఐ.టి. జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన ఎస్.వి. డిగ్రీ కళాశాల జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్‌కుదిగిన ఎస్ఆర్ఐటీ జట్టు 9.1 ఓవర్లలో 33 పరుగులకే ఆలౌటైంది. ఎస్.వి. డిగ్రీ కళాశాల జట్టు బౌలర్లు జయరామ్ 3, సాయి 3 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప ఎస్.వి. డిగ్రీ కళాశాల జట్టు 4.3 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 37 పరుగులు చేసింది. జట్టులోని జయరామ్ 20 పరుగులు చేశాడు. కడప ఎస్వీ. డిగ్రీ కళాశాల జట్టు 9 వికెటతో గెలుపొందింది.

'రాచపూడి'రాజసం..


బద్వేలు శ్రీరాచపూడి నాగభూషణం డిగ్రీ కళాశాల జట్టు

కేఎస్ఆర్ఎం మైదానంలో జరిగిన మ్యాచ్–1లో బద్వేలు శ్రీరాచపూడి నాగభూషణం డిగ్రీ కళాశాల, కడప కేఎస్ఆర్ఎం ఎంబీఏ కళాశాల జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన రాచపూడి జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన కేఎస్ఆర్ఎం జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 88 పరుగులు చేసింది. జట్టులోని జి. సుదర్శన్ 36 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాచపూడి జట్టు 8.1 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 90 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని శ్రీకర్ 53 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. బద్వేలు శ్రీరాచపూడి నాగభూషణం డిగ్రీ కళాశాల జట్టు 7 వికెట్లతో విజయం సాధించింది.

పాలకొండ్రాయ జట్టు జయభేరి


ఓబులవారిపల్లె శ్రీపాలకొండ్రాయ డిగ్రీ కళాశాల జట్టు

కేఎస్ఆర్ఎం మైదానంలో జరిగిన మ్యాచ్–2లో ఓబులవారిపల్లె శ్రీపాలకొండ్రాయ డిగ్రీ కళాశాల, కడప శ్రీహరి డిగ్రీ కళాశాల–1 జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన పాలకొండ్రాయ జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన శ్రీహరి కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 56 పరుగులు చేసింది. జట్టులోని గణేష్ 8 పరుగులు చేశాడు. పాలకొండ్రాయ బౌలర్ వెంకటసాయిరెడ్డి 2 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్ దిగిన పాలకొండ్రాయ జట్టు 3 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 58 పరుగులు చేసింది. జట్టులోని వెంకటసాయిరెడ్డి 26 పరుగులుచేశాడు. దీంతో పాలకొండ్రాయ డిగ్రీ కళాశాల జట్టు 10 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

ట్రిపుల్‌ఐటీ జట్టుకు విజయం..


ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ జట్టు

కేఎస్ఆర్ఎం మైదానంలో జరిగిన మ్యాచ్–3లో ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ జట్టు, బద్వేలు ఎస్.బి.వి.ఆర్. డిగ్రీ కళాశాల జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన బద్వేలు ఎస్.బి.వి.ఆర్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ట్రిపుల్‌ఐటీ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 71 పరుగులు చేసింది. జట్టులోని సాయికుమార్ 12 పరుగులు చేశాడు. ఎస్.బి.వి.ఆర్. బౌలర్ ఎస్.సాయి 3 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బద్వేలు ఎస్.బి.వి.ఆర్. జట్టు 10 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 65 పరుగులు చేసింది. జట్టులోని ఎస్. సాయి 33 పరుగులు చేశాడు. ట్రిపుల్‌ఐటీ బౌలర్ పవన్‌కుమార్ 3 వికెట్లు తీశాడు. దీంతో ట్రిపుల్‌ఐటీ జట్టు 6 పరుగుల తేడాతో విజయం సాధించింది.

గ్లోబల్ కాలేజీ..


కడప గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు

కేఓఆర్ఎంలో జరిగిన మ్యాచ్–1లో గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాల, కడప నిర్మల ఫార్మసీ కళాశాల జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన గ్లోబల్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 10 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 104 పరుగుల భారీ స్కోరు చేసింది. జట్టులోని అమర్‌నాథ్‌రెడ్డి 12 బంతుల్లో 34 పరుగులు చేశాడు. నిర్మల బౌలర్ కృష్ణ 3 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నిర్మల జట్టు 10 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 92 పరుగులు చేసింది. జట్టులోని హరిష్ 23 పరుగులు చేశాడు. గ్లోబల్ బౌలర్ రెడ్డి మహేష్ 2 వికెట్లు తీశాడు.గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు 13 పరుగుల తేడాతో విజయం సాధించింది.

శ్రీహరి డిగ్రీ కాలేజీ..


కడప శ్రీహరి డిగ్రీ కళాశాల-2 జట్టు

కేఓఆర్ఎంలో జరిగిన మ్యాచ్–3లో కడప శ్రీహరి డిగ్రీ కళాశాల–2 జట్టు, కడప అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన శ్రీహరి జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన అన్నమాచార్య జట్టు 10 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 45 పరుగులు చేసింది. జట్టులోని శ్రీనివాసరెడ్డి 20 పరుగులు చేశాడు. శ్రీహరి బౌలర్లు మౌలాలి 3, దీపక్ 1 వికెట్ తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన శ్రీహరి జట్టు 5.2 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 46 పరుగులు చేసింది. అమానుల్లా ఖాన్ 21 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. దీంతో కడప శ్రీహరి డిగ్రీ కళాశాల–2 జట్టు 9 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

నాటుసారా స్థావరాలపై ఉక్కుపాదం

- 2,800 లీటర్ల ఊట, 40లీటర్ల సారా స్వాధీనం
- ఏడు ద్విచక్రవాహనాల సీజ్, ఇద్దరి అరెస్ట్

మదనపల్లె : నాటుసారా రక్కసికి ఇద్దరు కార్మికులు బలైన నేపథ్యంలో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాలతో ఎస్ఈబీ, పోలీసులు సారా స్థావరాలపై ఉక్కుపాదం మోపారు. మండలంలోని నారమాకులతండాలో వేకువజాము నుంచి ప్రతి ఇల్లు జల్లెడ పట్టారు. గ్రామసమీపంలోని వ్యవసాయ పొలాలు, కొండప్రాంతాల్లోని నాటుసారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించి 2,800 లీటర్ల సారాఊటను ధ్వంసం చేశారు. గ్రామంలో నిర్వహించిన తనిఖీల్లో 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు.రవాణాకు ఉపయోగించే రికార్డులు లేని ఏడు ద్విచక్రవాహనాలను సీజ్ చేశారు. సారా తయారీకి ఉపయోగించే వస్తువులు, సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన మల్‌రెడ్డినాయక్(40), ప్రభయ్య(45)లను అరెస్ట్ చేశారు. మదనపల్లె ఇన్‌చార్జ్ డీఎస్పీ శ్రీనివాసరావు నేతృత్వంలో జరిగిన కార్డెన్‌సెర్చ్‌లో ఎస్ఈబీ అధికారి రాధాకృష్ణ, సీఐలు మురళీకృష్ణ, సత్యనారాయణ, శివాంజనేయులు, ఎస్ఈబీ సీఐ మురళీకిషోర్, సబ్‌డివిజన్ పరిధిలోని 10మంది ఎస్ఐలు, 80మంది పోలీసు, 10మంది ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం గ్రామస్తులతో ఏర్పాటుచేసిన సమావేశంలో.. డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ..నాటుసారా తయారీ చట్టవిరుద్ధమని, పలుమార్లు హెచ్చరించి, పీడీ కేసులు పెట్టినా మళ్లీ మళ్లీ నేరాలకు పాల్పడుతుండటం శోచనీయమన్నారు. సారా తయారీదారులు తమ పద్ధతులు మార్చుకోవాలని, ఇతర ఉపాధి మార్గాలు ఎంచుకోవాలన్నారు. చట్టవ్యతిరేక పనులకు పాల్పడితే జిల్లా బహిష్కరణకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


నాటుసారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకుంటున్న డీఎస్పీ శ్రీనివాసరావు, పోలీసు అధికారులు

విద్యుదాఘాతంతో మహిళ మృతి

ఒంటిమిట్ట: మండల పరిధిలోని నరసన్నగారిపల్లి గ్రామానికి చెందిన సైదుగార్ల సుబాన్‌బీ(61) అనే మహిళ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఏఎస్ఐ శివకుమార్ తెలిపారు. పోలీసుల కథనం మేరకు గత నెల 14వ తేదీన సుబాన్‌బీ తన వ్యవసాయ పొలంలో మోటార్ వేయడానికి వెళ్లినపుడు విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితిలో పడిపోయింది. స్థానికులు గమనించి కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స అనంతరం తిరుపతిలోని రుయా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందిందని పోలీసులు తెలిపారు.

పాలిటెక్నిక్ స్పోర్ట్స్ ప్రారంభం

విజయవాడ స్పోర్ట్స్: 25వ రాష్ట్ర స్థాయి పాలిటెక్నిక్స్ స్పోర్ట్, గేమ్స్ బాలబాలికల పోటీలు విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం ప్రారంభమయ్యాయి. విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి సౌరభ్ గౌర్, సాంకేతిక విద్యా కమిషనర్ సి.నాగరాణి పోటీలను ప్రారంభించారు. ఉమ్మడి 13 జిల్లాల క్రీడాకారులు తొలుత క్రీడా జ్యోతితో మైదానంలో ప్రదర్శన ఇచ్చారు. సాంకేతిక విద్య కమిషనర్ నాగరాణి మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీ వరకు జరిగే ఈ పోటీల్లో 1600 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు.

దంపతుల ఆత్మహత్యాయత్నం




ఆత్మహత్యకు యత్నించిన ఆనంద, విజయలక్ష్మీకి వైద్యసేవలు అందిస్తున్న వైద్యులు

గుర్రంకొండ : కుటుంబ కలహాలతో దంపతులు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన సంఘటన మండల కేంద్రమైన గుర్రంకొండలో చోటు చేసుకొంది. పోలీసుల కథనం మేరకు గుర్రంకొండ మండలం తరిగొండ గ్రామ ఇందిరమ్మ కాలనీకి చెందిన చార్లగుండ్ల ఆనంద(29)కు కలకడ మండలం కదిరాయచెరువు గ్రామానికి చెందిన విజయలక్ష్మీ(24)కి ఆరేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. దంపతులిద్దరు బతుకుదెరువు నిమిత్తం మదనపల్లె పట్టణంలోని నీరుగట్టువారిపల్లెలో మగ్గాలు నేసుకొంటూ జీవనం సాగిస్తున్నారు.కొంతకాలంగా వీరి మధ్య కుటుంబ కలహాలు చెలరేగాయి. ఈనేపథ్యంలో రెండురోజుల క్రితం విజయలక్ష్మీ మదనపల్లె నుంచి పుట్టినిల్లు అయిన కదిరాయచెరువుకు చేరుకుంది అక్కడి పెద్దలు భార్యభర్తలకు సర్దిచెప్పి వివాదాన్ని పరిష్కరించారు. బుధవారం ఇద్దరు మదన పల్లెకు తిరుగుప్రయాణమయ్యారు. మార్గమధ్యంలో గుర్రంకొండలో దిగిపోయారు. మరోసారి వారి మధ్య వివాదం చెలరేగింది. మనస్తాపానికి గురైన ఇద్దరు స్థానిక ఏనుగుల చెరువు కట్ట వద్ద పురుగులమందు తాగారు. కొద్దిసేపటికి అటువైపు వెళ్లే పాదచారులు గమనించి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అనంతరం మెరుగైన వైద్యసేవల కోసం మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే విజయలక్ష్మీ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

గ్యాస్ ట్యాంకర్ బోల్తా: తప్పిన ప్రమాదం

చిన్నమండెం : కడప–బెంగళూరు జాతీయ రహదారిపై మండలంలోని కేశాపురం చెక్‌పోస్టు వద్ద బుధవారం ఉదయం గ్యాస్ ట్యాంకర్ బోల్తాపడింది. ఎస్ఐ రమేష్‌బాబు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.కే01 ఏహెచ్ 4345 నంబర్ గల గ్యాస్ ట్యాంకర్ గ్యాస్‌ను నింపుకొని కడపకు బయలుదేరింది. కేశాపురం చెక్‌పోస్టు వద్దకు రాగానే డ్రైవర్ మురుగేష్ నిద్రమత్తులో ఉండగా పక్కనే ఉన్న టీఎస్88 8410 నబబర్ గల సిమెంట్ ట్యాంకర్‌ను ఢీకొంది. అనంతరం డాబా వద్ద టీ తాగడానికి వచ్చి ద్విచక్రవాహనాలను ఆపి ఉండగా వాటిపైకి గ్యాస్ ట్యాంకర్ దూసుకెళ్లింది పక్కనే ఉన్న దుకాణాన్ని ఢీకొని జాతీయ రహదారి పక్కన బోల్తాపడింది. ఈ క్రమంలో మల్లికార్జున అనే వ్యక్తి తన ద్విచక్రవాహనానికి పెట్రోల్ పట్టుకొని రోడ్డు మీద ఉండగా అతనిని కూడా ఢీకొంది. సమాచారం అందుకున్న ఫైర్ ఇన్‌స్పెక్టర్ వెంకట్రామిరెడ్డి, రూరల్ సీఐ లింగప్ప, ఎస్ఐ రమేష్‌బాబు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. విషయాన్ని కడప డిప్యూటీ జనరల్ మేనేజర్ ధర్మారావుకు సమాచారం అందజేశారు. ఆయన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


బోల్తా పడిన గ్యాస్ ట్యాంకర్‌ను పరిశీలిస్తున్న రూరల్ సీఐ లింగప్ప, ఎస్ఐ రమేష్‌బాబు

అయ్యో పాపం..

- గర్భం దాల్చిన పదిహేనేళ్ల బాలిక
- ఇద్దరిపై కేసు నమోదు

జమ్మలమడుగు : పదిహేనేళ్ల బాలిక గర్భం దాల్చిన సంఘటన వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు మండలం సలివెందుల గ్రామంలో చోటుచేసుకుంది. పట్టణ సీఐ సదా శివయ్య బుధవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఆయన కథనం మేరకు జమ్మలమడుగు మండలం సలివెందుల గ్రామానికి చెందిన సుబ్బరాయుడు, నరసమ్మలు కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.పెద్ద కుమార్తెకు వివాహం చేశారు. సుబ్బరాయుడు, నరసమ్మల మధ్య మనస్పర్థలు రావడంతో సంవత్సరం కిందట విడిపోయారు. దీంతో కుమారుడిని తీసుకుని తల్లి వెళ్లిపోయింది. వీరి మరో కుమార్తె సలివెందుల గ్రామంలోనే వరుసకు అవ్వ అయిన వారి ఇంట్లో ఉంటోంది. గ్రామంలోని ఓ టీ దుకాణంలో పనిచేస్తోంది. మానసిక స్థితి సరిగా ఉండేది కాదు. ముక్కుపచ్చలారని ఆ బాలికకు మాయమాటలు చెప్పి అదే గ్రామానికి చెందిన 50 సంవత్సరాల వ్యక్తి, 35 ఏళ్ల మరో యువకుడు అఘాయిత్యానికి పాల్పడ్డారు. దీంతో బాలిక గర్భం దాల్చింది. తనకు కడుపు నొప్పిగా ఉందని విషయాన్ని తండ్రికి తెలిపింది. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లి చూపించడంతో అసలు విషయం బయటపడింది. వైద్యులు పరీక్షలు జరుపగా 5 నెలల గర్భిణి అని తేలింది. దీంతో జమ్మలమడుగు అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో తండ్రి ఫిర్యాదు చేశాడు. బాలిక గుర్తించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.